మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# మిల్లర్లు వరి ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేసుకోవాలి

● ధాన్యం సేకరణలో కోతలు విధించవద్దు : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**పెబ్బేరు, మే 20 ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం సేకరణలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ హెచ్చరించారు. బుధవారం పెబ్బేరు మండల పరిధిలోని సాయి గోపాల ఇండస్ట్రీస్ మిల్లును సందర్శించి అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. పాతపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వడ్ల కొనుగోలు కేంద్రం షర్మిల గ్రామ శివారులో మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిల్లర్లకు పలు కీలక సూచనలు చేశారు. వరిధాన్యం లారీలలో ఎక్కువ సమయం నిరీక్షింప చేయకుండా వేగంగా జరిగేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా దాన్యంలో ఎలాంటి కోతలు విధించడానికి వీల్లేదన్నారు. రైతులు ధాన్యం తేమ శాతం నిర్దేశించిన దానికన్నా తక్కువ వేస్తున్నారన్నారు. మిల్లులు గోదాముల వద్ద వేచి ఉన్న లారీలను వీలైనంత త్వరగా కాల్ చేయాలన్నారు. ట్రక్ సీట్లను వెంటనే వాట్సప్ ద్వారా పిపిసి ఇంచార్జిలకు పంపాలని మిల్లర్లను ఆదేశించారు. దీంతో ట్యాబ్ ఎంట్రీలు త్వరగా పూర్తయి రైతుల ఖాతాల్లో డబ్బులు జమవు తాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రిజిస్టర్ లలో తనిఖీ చేసి ఇంర్జిలకు సూచనలు చేశారు. కలెక్టర్ భీమశాతాన్ని స్వయం గా పరిశీలించారు. రైతులు వరి ధాన్యాన్ని శుభ్రపరచి తీసుకొచ్చే విధంగా అవగాహన కల్పించాలని వారికి తెలిపారు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు రాకుండా ఉంటాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్ పోర్ట్ కు సంబంధించిన కొంత లారీల కొరత ఉందని రైతులు తెలపగా అదనంగా లారీలను పంపి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. అదేవిధంగా టార్పాలిన్లు అందు బాటులో ఉంచాలని వర్షం వస్తే రైతులకు ఇబ్బంది కలగకుండా ఇంచార్జీలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్. ఎంపీడీవో ప్రవీణ్, రెవెన్యూఅధికారులు ఉన్నారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

# రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎక్కడుంది..?

- అమ్మాయిలకు మైనర్లకు రక్షణ ఏది?
- నిందితులను కాపాడేందుకు పనిచేస్తున్నారా..?
- తన సొంత జిల్లాగా చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి..
- జడ్చర్ల నడిబొడ్డున కత్తులతో దాడులు చేస్తుంటే ఏం చేస్తున్నారు
- బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**మహబూబ్ నగర్ బ్యూరో, మే 20, ప్రభాతవార్త:** పాలమూరు బిడ్డగాచెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి సొంత గడ్డ పాలమూరులోనే జడ్చర్ల కేంద్రంలో కంప్యూటర్ సైన్స్ పీజీ చేసిన విద్యార్థికి రక్షణ లేకుండా పోయిందని, పట్టపగలే దుండగులు కత్తులు పట్టుకొని నటిరోడ్డులో సంచరిస్తున్న పట్టించుకోని వ్యవస్థ నెలకొందని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో శనివారం ప్రేమోన్మాది చేతిలో పట్టణానికి చెందిన వైష్ణవి దారుణ హత్యకు గురి కావడంతో బుధవారం జడ్చర్ల లోని బాధ్యత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైష్ణవి తల్లిదండ్రులు రామచందర్ శ్రీలత లను ఓదార్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ హయాంలో నిత్యంపెట్రోలింగ్ వ్యవస్థ పని చేసేదని, రూ.700 కోట్లతో పోలీసు వ్యవస్థలో అనేక మార్పులను అదునాతన వాహనాలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. పోక్సో బాధితులకు రక్షణ లేని పరిస్థితి నెలకొందని, నిందితులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎప్పుడు కేసీఆర్ పాలన వస్తుందని తమ ధనామా నా ప్రాణాలకు రక్షణ దొరుకుతుందని ప్రజలు వేయికళ్ల తో ఎదురుచూస్తున్నారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాల పక్షాన తమ పోరాటం నిరంతరంగా కొనసాగు తుందని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ రాజీ నామా చేయాలి.. కేంద్రమంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. తన కుమారుడు సాయి భగీరథ కేసు విషయంలో నైతిక బాధ్యత వహించాలన్నారు. బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి సిగ్గుందా అని ప్రశ్నించారు. సాయి భగీరథ, బాధితురాలు అయిన మైనర్ బాలిక ఇద్దరూ బావ మరదళ్లలా తిరుగుతున్నారని, మైనర్ బాలిక కార్ డ్రైవ్ చేస్తూ తన ఇష్ట పూర్వకంగానే కార్యక్రమాలు చేశారని అనడానికి సిగ్గుండాలి అని ధ్వజమెత్తారు. మీకు ఆడ పిల్లలు లేరా అంటూ ప్రశ్నించారు. బిజెపి నేతలు మొదటి నుంచి చెబుతున్నా భేటీ బచావో బేటి పడావో కేవలం డ్రామాలు మాత్రమే అని స్పష్టమైంది అన్నారు. బండి సంజయ్ సోషల్ మీడియా సభ్యులుఅమ్మాయిల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ అమ్మాయే మొత్తం తప్పు చేసింది అబ్బాయి మంచోడు అనేలా క్రియేట్ చేస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సిగ్గ లేకుండా నిందితులను వెనకేసుకొచ్చే మాటలు మాట్లాడుతూ వాళ్ళ ఇంట్లో కూడా బాధ ఉంటుందని అనడం ఎంతవరకు సమంజసం అన్నారు..ఎవరి మీద సానుభూతి చూపిస్తున్నావు మల్లురవి, అందుకేనా నిన్ను నాగర్‌కర్నూల్ ప్రజలు ఎంపీగా గెలిపించింది అంటూ ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం తన ఆస్తులను కాపాడుకోవడానికి పెట్రో లింగ్ వ్యవస్థను వాడుకుంటున్నారని ఆరోపించారు. 18 గంట లు పనిచేస్తున్న రివ్యూలు చేస్తున్నాను అని చెప్పుకునే రేవంత్ రెడ్డి నిజంగా రివ్యూ చేస్తే ఇప్పటికే ఇద్దరు కమిషనర్లు సస్పెండ్ కావాలన్నారు. తన ఆస్తులు పంచుకోవడానికి అన్నదమ్ముల ఆస్తులు కాపాడుకోవడానికి పోలీస్ వ్యవస్థ -మిగతా4లో..



మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

# గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు అందించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



విజయ పాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే20 ప్రభాతవార్త:** గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, పారి శుద్ధం, విద్యుత్, విద్య, వైద్య సేవల వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి నిరక్ష్యం చోటుచేసు కోకూ డదని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను హెచ్చరించారు. బుధవారం ఉదయం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు పరిస్థితులపై ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఏటీసీ సెంటర్‌కు అవసరమైన 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఏటీసీ నిర్మాణంతో పాటు ప్రత్యేక మోడల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాలపై అధికారులకుపలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం గ్రామంలో ఆధునిక సదుపాయాలతో ఇటీవల ప్రారంభించిన మిల్క్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, పాల ఉత్పత్తిదారులకు అందుతున్న సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పాల సేకరణ, టెస్టింగ్ విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి పశుసంవర్ధక సేవలు గ్రామస్థులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో నిర్మా ణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలుఅందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆధునిక హంగులతో నిర్మిస్తున్న పాఠశాల భవనం, ఆరోగ్య కేంద్రం త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సంప్ పనులను పరిశీలించిన కలెక్టర్, పారి శుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. అండర్ డ్రైనేజ్ నీటిని శుద్ధి చేసే విధంగా నిర్మిస్తున్న శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి, గ్రామాల పారి శుద్ధ్య పరిస్థితుల మెరుగుదల ప్రజారోగ్యానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అభివృద్ధి కార్యక్రమం ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ఉండాలని, పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధి దారునికి చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచిం చిన కలెక్టర్, గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజల భాగ స్వామ్యం కూడా కీలకమని పేర్కొ న్నారు. అధికారులు గ్రామస్థులతో సమన్వయం చేసు కుంటూ పనిచేయాల ని సూచించారు. అంతకుముందు కలెక్టర్ గ్రామంలోని శ్రీఆంజనేయ స్వామి దేవాలయం ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కలెక్టర్‌కు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజే శారు. జిల్లా కలెక్టర్ వెంటఅదనపు కలెక్టర్ దేవ సహా యం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయ కుమార్, డీఈఓ రమేష్ కుమార్, డివిజన్ మరియు మండల స్థాయి అధికారులు గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాభివృద్ధికి కలెక్టర్ భరోసా

- విద్యాశాఖకు సంపూర్ణ సహకారం అందిస్తాం
- నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**నారాయణపేట, మే 20 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల పేటలో జిల్లా వార్షిక విద్యా ప్రణాళిక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావే శానికి జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అకాడమిక్ రిసోర్స్ పర్స న్స్, ఉపాధ్యాయులను ఉద్దేశించి మార్గదర్శక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవిద్యాశాఖకు సంపూర్ణ సహ కారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యా నాణ్యత పెంపు, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల సమస్యల పరిష్కారం, అవసరమైన పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలఅభివృద్ధి, విద్యార్థుల అభ్యాస స్థాయిల పెంపు, ప్రతి చిన్నా రికి నాణ్యమైన విద్య అందించడం జిల్లాయంత్రాంగం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే అకాడమిక్ కార్యక్రమాలు సమగ్ర ప్రణాళికతో -మిగతా4లో..

మోసపూరిత హామీలతో

## అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతులను విస్మరిస్తున్న రేవంత్ సర్కార్
- ప్రాజెక్టులపై కపట ప్రేమ : మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, మే,20 ప్రభాతవార్త:** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డను అని కపట ప్రేమను చూపిస్తున్నారన్నారు. పాల మూరు రైతులపట్ల ప్రేమ వుంటే ప్రాజెక్టుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పాలమూరు ప్రజల ఆకాంక్ష అయిన అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, ఉమామహేశ్వర ప్రాజెక్ట్ వంటి కీలక ప్రాజెక్టులను ఉద్దేశ పూర్వకంగా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన ఉమామహేశ్వర ప్రాజెక్ట్ భూ సేకరణ పనులను కూడా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ అడుగడుగునా అడ్డుకుంటూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు నీళ్ల అందకుండా చేసి రాజకీయ లాభం పొందాలని కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. పాల మూరు రైతులను, పేదలను, గిరిజనులను మోసం చేసిన ఈ ప్రభుత్వ దొంగ హామీలను గ్రామ గ్రామాన బట్టబయలు చేస్తానని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు బనాయించడం, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ నైజమైందని అన్నారు. రైతుల తరఫున పోరాడుతున్న నాయకులను భయ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. పాలమూరు వలస కూలీ బిడ్డ ఈ గువ్వల బాల రాజు.. పేదరికం, కష్టాలు, ఆకలి ఏమిటో నాకు తెలుసు. అందుకే రైతుల బాధ, యువత ఆవేదన, నిరుద్యోగుల కన్నీళ్లు నాకు అర్థమవుతాయన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల కోసం నేను నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ నాయకత్వంతో చర్చించి అచ్చంపేట నుంచే భారీప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర బిజెపి నాయకులు మంగ్య నాయక్, బీజేపీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో ప్రజల గడప వద్దకే పోలీసు సేవలు

- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- ఒక్క ఫోన్ కాల్‌తో మీ వద్దకే పోలీసు సేవలు
- సంఘటన స్థలానికే చేరుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్న పోలీసులు
- ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో మైనర్ బాలికకు తక్షణ న్యాయం
- అత్యవసర సమయంలో ప్రజలకు అండగా వనపర్తి పోలీసులు



ఎస్పీ సునీత రెడ్డి (ఫైల్)

**వనపర్తి, మే 20, ప్రభాతవార్త:** ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో వనపర్తి జిల్లా పోలీసులు ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునితరెడ్డి తెలిపారు. ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, సంఘ టన జరిగిన ప్రదేశానికే వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసేఈ విధానం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా, నమ్మకమైన పోలీసు సేవలు అందించాలనే ఉద్దేశంతో వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకే తిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తోంది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో, సంఘటన స్థలానికే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు ఈ విధానంఎంతో ఉపయోగపడుతోంది. ప్రత్యేకించి మహిళలపై అత్యాచారాలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చోరీలు, గొడవలు, మిస్సింగ్ కేసులు, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, ర్యాగింగు లు, వృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, అత్యవసర పరిస్థితు ల్లో ఉన్న బాధితులకు ఈ సేవ ఎంతో మేలు అనేక -మిగతా4లో..

ముున్సిపాలిటీలో ప్రత్యేక అడిషనల్ కలెక్టర్ ద్వారా

## పరిపాలన కొనసాగించాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**మక్తల్, మే20 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికలు జరిగి వంద రోజులు పూర్తయినా మక్తల్ పురపాలక సంఘంలో ఇప్పటివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా పనులు సాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జుట్ల చిన్న హనుమంతు అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే రామ్మో హన్‌రెడ్డి నివాసంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామ్మో హన్ రెడ్డి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సిసి రోడ్లు, డ్రైనేజీల పనులకు ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి బిల్లులుచేయించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రజల సౌలభ్యం కోసం మక్తల్ మున్సిపాలిటీని ఏర్పాటు -మిగతా4లో..

## ప్రజా క్షేమమే ముఖ్యం

- ప్రజా భద్రత ట్రాఫిక్ నిర్వహణలో సమగ్ర మార్పులు
- స్పీడ్ గన్స్, వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలి
- ఆరు నెలల్లో 750 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- రోడ్ సేఫ్టీ పై సమీక్ష




మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 20 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణం లో ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణలో సమగ్ర మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎన్ఐసి కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధి కారులతో నిర్వహించిన రోడ్ సేఫ్టీ సమీక్షా సమావేశంలో ఆయన విస్తృ తంగా చర్చించారు. ఈ సమావేశంలో పోలీస్, ట్రాఫిక్, మున్సిపల్, రోడ్డు రవాణా శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని ప్రస్తుత పరిస్థి తులను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. పట్టణంలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రజల భద్రత కోసం వచ్చే ఆరు నెలలలో మహబూబ్‌నగర్ మొత్తం 750 వరకు సీసీ కెమెరాల తో కవర్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సీసీ కెమెరాలను ఎస్డీఎఫ్, ముడా, మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో సమన్వయంగా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. చిన్నపిల్లలువాహనాలు నడపడం వల్ల ప్రమా దాలు పెరుగుతున్న నేపథ్యంలో, మైనర్లు వాహనాలు నడపకుండా కఠినం గా నియంత్రించాలని పోలీస్ శాఖకు ఆదేశించారు. తల్లిదండ్రులపై కూడా బాధ్యతను నిర్ధారించే చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరం చుట్టూ ఉన్న ప్రధాన హైవేలు, బైపాస్ రోడ్లలో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి వేగ నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో అతివేగం వల్ల జరిగే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచడానికి రోడ్ సేఫ్టీ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఎస్పి, నగర మేయర్, డిప్యూటీ మేయర్, ముడా చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తదితరులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కమిటీ ప్రతి నెలా సమావేశమై రోడ్ సేఫ్టీ పరిస్థితులను సమీక్షించి, తక్షణ చర్యలు చేపడుతుందని తెలిపారు. వాహన యజమానులు, డ్రైవర్లలో బాధ్యత పెంపొందించేందుకు ప్రత్యేక అవగా హన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాల పాటించాలని, తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పట్టణంలో సమయాన్ని మించి బార్ షాపులు, హోటల్స్ నడపరాదని స్పష్టంగా హెచ్చరించారు. నియమావళి ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. -మిగతా4లో..

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు

## క్రీడలు ఎంతో దోహదపడతాయి

- జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్



వెల్టూర్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్

**ఉప్పునుంతల, మే 20 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొం దించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నడుస్తున్న వేసవికాలం కబడ్డీ శిక్షణ శిబి రాన్ని డిఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ వేసవి కాలంలో బడి పిల్లలకు సెలవు దినాలు ఉన్నప్పటికీ -మిగతా4లో..

## ఎండల తీవ్రతపై కూలీలు అప్రమత్తంగా ఉండాలి

**ఉపాధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్**



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**నవాబ్‌పేట, మే 20 ప్రభాతవార్త :** ఉపాధి హామీ కూలీలు వేకువజామునే కూలీలు బయలుదేరాలని ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాకర్లపాడు రామ్ సింగ్ తండా కాకర్జాల ఉపాధి హామీ పరిశీలించి కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీల హాజరు, పనుల పురోగతిని పరిశీలించిన ఆయన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలకు తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని సూచించారు. ఆ యా గ్రామాల చెరువులలో కొ నసాగుతున్న ఉపాధి పనులను అయన ఉదయం 6 గంటలకే ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో గుర్తించిన ఉపాధి పనుల్లో పది పనులలో కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజ రయ్యే విధంగా చూడాలని సూచించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం నాయక్ ఏపీవో జ్యోతి ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, తదితరులు ఉన్నారు.

## ఎవరి కులం ఎంత వారికంత వాటా ..

**భారీ బహిరంగ సభ గోడపత్రిక ఆవిష్కరణ**



గోడ పత్రికల ఆవిష్కరణ చేసిన దృశ్యం

**పెద్దమందడి, మే 20 ప్రభాతవార్త :** పెద్దమందడి మండల కేంద్రంలో ఎవ కులం ఎంతో వారికంత వాటా అనే నినాదంతో మే 31న వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికను పెద్దమందడి మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ,జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ ఎస్టీ, జేఏసి మండల కన్వీనర్ ఈశ్వర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం రాజ్యాధికారం సాధనే ధ్యేయంగా ధర్మ సమాజ పార్టీ సంపూర్ణ మద్దతుతో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 31వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు వనపర్తి లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ప్రాంగణం జరిగే ఈ బహిరంగ సభకు బహుజనులు ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కమిటీ సభ్యులు మధు మహారాజ్, ఈశ్వర్, శాంతన్న, భగవంతుడు, మధుసూదన్, జీవన్, సురేష్ యువకులు పాల్గొన్నారు.

## శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

**చిన్న చింతకుంట, మే 20 ప్రభాతవార్త :** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడిగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం కానుకల రూపేనా స్వామివారి హుండీలో వేసిన నగదును ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి,దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బత్తుల బాలరాజ్, దేవస్థాన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో లెక్కించగా రూ.9లక్షల10వేల 636ల ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు వేఘనాథ్, మహిపాల్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, ప్రేమ్ సాగర్, శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి, శంకర్, నాగార్జున, తిరుపతయ్య, మహేందర్, భాస్కరాచారి ,అర్జున్, బాలరాజు, సౌజన్య ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు చేస్తున్న దృశ్యం

## ఉపాధి కూలీలకు వాటర్ క్యాన్‌ల పంపిణ



ఉప్పునుంతల లో సర్పంచు శ్రీనివాసులు చేతుల మీదుగా ఉపాధి కూలీలకు వాటర్ క్యాన్ల్ పంపిణీ

**ఉప్పునుంతల, మే 20 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఉపాధి కూలీలకు బుధవారం గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు చేతుల మీదుగా కూలీలకు వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి కూలీలు వీటి వసతి ఉన్న ప్రాంతంలో వాటర్ తీసుకురావడానికి వాటర్ క్యాన్ల్ లేకపోవడంతో కూలీలు సకాలంలో నీరు తాగాక వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని భావించి గ్రామ పంచాయతీ నుంచి వాటర్ క్యాన్ల్ పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఉపాధికూలీలు ఉదయం వేళల్లో పనులు చేపట్టి ఎండ తీవ్రత కాకముందే ఇంటికి చేరుకోవాలని,ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉపాధి పనులు చేపట్టిన ప్రాంతంలో టెంట్ సౌకర్యం కల్పించాలని సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు సూచించారు. వాటర్ క్యాన్ల పంపిణీ కార్యక్రమంలో సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులుతో పాటు పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, సీనియర్ మెట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

**జిల్లా వ్యవసాయాధికారి ఆంజనేయులు**



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఆంజనేయులు

**మదనాపురం, మే 20 ప్రభాతవార్త :** ప్రభుత్వం సూచించిన విత్తనాలనే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఆంజనేయులు తెలిపారు. ఖరీఫ్‌లో రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయబడిన విత్తనాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఆయన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫెర్టిలైజర్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎనిమిదిరకాల సన్నరకాలను మాత్రమే సిఫార్సు చేసిందని, డిఆర్ఆర్75 రకంను డీలర్లు అమ్మరాదన్నారు. ఎప్పటికప్పుడు తమ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని, అదేవిధంగా ధరల పట్టిక స్టాక్ వివరాలను బోర్డుపై పేర్కొనాలని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎరువులను బ్లాక్ మార్కెట్లో అమ్మరాదని రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏడిఏ దామోదర్‌గౌడ్, మండల వ్యవసాయా ధికారి గాయత్రి, ఆత్మకూరు ఏవో రాజేష్, ఏఈఓలు అనిత, సింధుజ, రజిని, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలి

**సెన్సస్ సూపర్‌వైజర్ పద్మావతి**



జనగణన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

**వనపర్తి,మే20, ప్రభాతవార్త:** జిల్లాలో ఇండ్ల గణన ప్రక్రియ ఈ నెల 11 నుంచి కొనసాగుతూ ఉండడంతో ఇందుకోసం వచ్చే ఎన్యూమరేటర్ల ప్రజలు సహకరించి ఖచ్చితమైన సమాచారాన్ని తెలియపరచాలని 19, 18 వార్డుల సెన్సస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. బుధవారం 19వ వార్డులో ఇంటింటి గణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లతో కలిసి పాల్గొని, ఇంటి యజమానులతో సమాచారానికి సంబంధించిన విషయాలను వివరించారు. ఈయొక్క ఇంటి గణనలో భాగంగా ప్రతి ఇంటి పరిస్థితి ఇంటి నిర్మాణ స్వభావం, గదుల సంఖ్య, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు,విద్యుత్తు, వంట ఇంధనం, వాహనాలు, ఇంటర్నెట్ సదుపాయం వంటి వివరణ స్వీకరిస్తారని,అలాగే మొబైల్ ఫోన్లో, టెలివిజన్, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటి వివరణ నమోదు చేయాల్సి ఉంటుందని ఇంటి యజమానులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డులకు సంబంధించిన ఎన్యూమరేటర్ల గంధం ప్రసాద్, యాదగిరి, సుధాకర్, బాలకృష్ణ పలువురు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి రూరల్, మే20, ప్రభాతవార్త:** బహుముఖ ప్రజ్ఞాశాలి, మేధావి, సాహితీవేత్త, న్యాయవాది సురవరం ప్రతాప్ రెడ్డి అని, వారి జీవిత చరిత్ర ఆవిష్కరించడం ద్వారా భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం సాహితి వేత్తలతో కలిసి వారి స్వగృహంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి మొట్టమొదటి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్ రెడ్డి అని వారి 130 వ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. తన రచనలతో కేంద్ర సాహితీ అవార్డు పొందిన మహనీయుడు సురవరం అని సామాజిక రుగ్మతలకు ఎదురొడ్డి నిలిచిన మహానుభావులు దళిత దండోరను స్థాపించి అణగారిన వర్గాలకు అండగా నిలిచిన అపరమేధావి సురవరం ప్రతాప్ రెడ్డి అని నిరంజన్ రెడ్డి కొనియాడారు. గోల్కొండ పత్రిక స్థాపించి జర్నలిస్టులకు ఆదర్శప్రాయునిగా నిలిచిన సురవరం 130వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సురవరం ప్రతాప్ రెడ్డి పేరు స్థిరస్థాయిగా ఉండాలని వారి పేరిట గ్రంథాలయం, సురవరం పార్కులో కాంస్య విగ్రహం ఏర్పాటు చేశామని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సురవరం జయంతి ఉత్సవాలలో ముఖ్యతిథులుగా వారి జీవితంపై పరిశోధన చేసిన గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, సాగునీటి రంగంలో పరిశోధన చేసి సాగునీటి రంగ నిపుణులుగా పనిచేసిన శ్రీధర్ రావు దేశ్ పాండే సాగునీటి రంగంతో పాటు తెలంగాణ అస్తిత్వవాదంతో రాజకీయ సామాజికఅంశాలు విశ్లేషణ చేస్తున్న సహచరఉద్యమకారుడు వి.ప్రకాష్ పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలు, విద్యావేత్తలు, సమాజం పట్ల పట్టింపు ఉన్నవిజ్ఞులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలి అని నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమములో జిల్లా మాజీ అధ్యక్షులు గట్టుయాదవ్, జిల్లామీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ సాహితీవేత్తలు వీరయ్య, బలరామ్, బైరోజు చంద్రశేఖర్, కిరణ్, తిరుమలేశ్, జోహెబ్ హుస్సేన్, కుమార్, తోట శ్రీను పాల్గొన్నారు.

# భూసార పరీక్షల ద్వారా ఎరువులను వాడాలి

**పంట మార్పిడి పద్ధతులను రైతులు పాటించాలి, సేంద్రీయ పద్ధతి ద్వారా వ్యవసాయం చేయాలి**



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

**శ్రీరంగాపూర్, మే 20 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ప్రొ॥ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అగ్రో నామీ విభాగానికి చెందిన శాస్త్రవేత్త డా. ఎన్. నవత రైతులకు పలు ముఖ్యమైన విషయాలను తెలియజేశారు. తక్కువ యూరియాను వాడాలని అధిక మోతాదులో యూరియాను వినియోగించడం వల్ల నేలస్సార తగ్గిపోవడంతో పాటు పంటల నాణ్యత దెబ్బతింటుందని, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని తెలిపారు. పంట మార్పిడి విధానాలను పాటించడం ద్వారా నేలలో పోషకాలు సమతుల్యంగా ఉండి చీడ,పీడల సమస్యలు తగ్గుతాయని, వరి తర్వాత పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలు సాగు చేయడం వల్ల నేలసారం పెరుగుతుందని తెలిపారు. సేంద్రీయ పద్ధతులను పాటించడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని, జీవామృతం, ఘన జీవామృతం, బయో ఫెర్టిలైజర్ వంటి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని, సేంద్రీయ వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో మంచి నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చని వివరించారు. రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో హైమావతి, ఏ ఈ ఓ శివ, హెచ్ఓ కృష్ణయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# 27వ రోజుకు చేరుకున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం



వెల్టూర్‌లో శిక్షణ పొందుతున్న క్రీడా కారులకు బియ్యం, బ్రెడ్ అందజేత

**ఉప్పునుంతల, మే 20 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం 27వ రోజుకు చేరుకుంది. వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి గ్రామస్తుల అపూర్వ స్పందన లభించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మక వేసవికాలంలో విద్యార్థులకు కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పించడం లో వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ అందరి సహకారం తీసుకుని శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు భోజన వసతి, అల్పాహారం, పండ్లు ఫలాలు అందించేలా గ్రామస్తుల సహకారాన్ని తీసుకుంటున్నారు. అందులో భాగంగా బుధవారం శిక్షణా శిబిరాన్ని గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఇడమెని దేవేందర్ సందర్శించారు. ఈ సందర్శన లో క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కబడ్డీ శిక్షణ శిబిరం క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని, మంచి నైపుణ్యాలను నేర్చుకొని భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వేసవికాలంలో కబడ్డీ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్రంలో ఎక్కడ కబడ్డీ పోటీలు నిర్వహించిన ప్రథమ స్థానంలో సాధించి వెల్టూరు గ్రామానికి వన్నె తీసుకురావాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు క్వింటాల్ బియ్యం, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్రీడాకారులకు కావలసిన మౌలిక వసతులను కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్శన లో ఫీల్డ్ అసిస్టెంట్ ఇడమెని దేవేందర్‌తో పాటు గ్రామ వార్డు సభ్యులు బూరం నరేష్ యాదవ్, గ్రామ యువకులు సమద్‌లు ఉన్నారు. క్రీడాకారులకు సూచనలు, సలహాలతో పాటు కావలసిన మౌలిక వసతులను కల్పించడంలో గ్రామస్తులు ఎంతో సహకారం అందిస్తున్నారని అందులో భాగంగా బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్ అందించిన సహకారం అభినందనీయమని వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ అన్నారు.

# మంచినీరు సరఫరా చేయాలంటూ..

**మండల పరిషత్ ఎదుట బిజెపి ధర్నా**



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నేతలు

**చిన్నచింతకుంట, మే 20 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని 8, 9, 10, 11 వార్డులకు ఊక చెట్టు వాగు నుంచి మంచినీరు సరఫరా చేయాలంటూ బిజెపి నగరశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు నందిరాజు, జిల్లా నాయకులు కురువ రమేష్ లు మాట్లాడుతూ నాలుగు వార్డులకు గత కొద్ది రోజులుగా ఉప్పునీరు సరఫరా చేయటం వల్ల కాలనీవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఊక చెట్టు వాగులో ఊట బావి లో నీరు అడగంటి పోతున్న ప్రత్యామ్నాయ మార్గాన్ని చూడకుండా ఉప్పునీటిని సరఫరా చేయడం ఎంతవరకు సమంజసం అంటూ గ్రామ కార్యదర్శిని ప్రశ్నించారు. వెంటనే ఊక చెట్టు వాగు నుంచి మంచినీరు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఊక చెట్టు వాగు సమీపంలో గల డంపింగ్ యార్డ్ లో చెత్త, కోళ్ల వ్యర్థపదార్థాలు, పందుల స్వైర విహారంతో దుర్గంధం వెదజల్లుతూ డంపింగ్ యార్డ్‌లో చెత్త తగలబెట్టడంతో పొగ 5 ,6 ,7 వార్డులలోని కాలనీవాసులు ఆ పొగను పీల్చడం వల్ల అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. వెంటనే డంపింగ్ యార్డ్ ను మార్చాలని వారు డిమాండ్ చేశారు. పదవ వార్డులోని తోలబండ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపాలని, పోచమ్మ దేవాలయం వద్ద ఇటీవల బోరు వేయగా సమృద్ధిగా నీరు రావడం జరిగిందని ఆ బోర్ ద్వారా తోలబండ నీటి ట్యాంకుకు పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని వారు కోరారు. ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, ఎంపీ ఓ శ్యాంసుందర్ రెడ్డిలు ధర్నా చేస్తున్న బిజెపి నేతలకు వద్దకు వచ్చి ఊక చెట్టు వాగు నుంచి మంచినీరు సరఫరాను ఒక రోజులోనే పరిష్కరిస్తామని, డంపింగ్ యార్డ్ ,తోలబండ కు మంచినీటి సరఫరా ను శనివారంలోగా పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో వార్డు సభ్యులు ఎస్ నాగేందర్, లక్ష్మణ్ , నరేష్, భాగ్యమ్మ లతోపాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**కెటిదొడ్డి మే 20, ప్రభాతవార్త:** జోగుళాంబ గద్వాల నియోజకవర్గంలో కెటిదొడ్డి మండలం పరిధిలోని కుచినెర్ల గ్రామంలో నూతన మహిళా సమైక్య బిల్డింగ్ (భవనం ) నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యేకి గ్రామ సర్పంచ్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిమహిళలకు పెద్దపీటవేస్తూ మహిళలకు మహిళ సమైక్య ఏర్పా టు చేసుకొని మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించడం జరు గుతుంది. కాబట్టి ప్రతి ఒక్క మహిళ మహిళా సమైక్యాల సభ్య రాలుగా ఉండాలి. మహిళాలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం వడ్డీ లేకుండా మహిళలకు రుణాలను అందించడం జరుగు తుంద ని తెలిపారు. ప్రతి మహిళలు మహిళా సంఘాలలో సభ్యురాలుగా ఉండి ఆర్థికంగా బలోపితం కావాలని ప్రభుత్వం ఇచ్చే అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా సమాఖ్య భవ నంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవాలి అని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే గ్రామం నియోజక వర్గ, జిల్లా రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలి పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, గ్రామ సర్పంచు కృష్ణయ్య, వార్డు సభ్యులు,నాయకులు ఆర్ .ఉరుకుందు, యుగేందర్ ,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

## సమయపాలన పాటించకుంటే చర్యలు : ఎస్సై సద్దాం



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న పోలీస్ అధికారులు

**అచ్చంపేట, మే, 20 ప్రభాతవార్త:** పట్టణంలో నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాలు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్సై సద్దాం హుస్సేన్ హెచ్చరించారు. పట్టణంలో నిర్వహిస్తున్న వ్యాపార సముదాయాలు మెడికల్ షాపులు తప్ప ఇతర వ్యాపార దుకాణాలు రాత్రి గం.ల11లోపు మూసివేయాలని సూచించారు. అదేవిధంగా అర్ధరాత్రి సమయంలో కారణాలు లేకుండా ఐడి కార్డ్ లైసెన్స్ లేకుండా తిరిగిన వాహనాలకు జరిమాన విధించారు. రాత్రి గం.లు 11 దాటినాక నిర్వహిస్తున్న హోటళ్లకు జరిమాన విధించారు. కారణం లేకుండా అర్ధరాత్రి తిరిగే యువతను హెచ్చరించారు.

## ఇండ్ల గణన సర్వేను పరిశీలించిన తహాశీల్దార్ సైదులు



వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్

**అచ్చంపేట, మే, 20 ప్రభాతవార్త:** ఇండ్ల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసిల్దార్ సైదులు సూచించారు. మండల పరిధిలోని లక్మాపూర్ (పిఎన్) చెంచు పలుగు తండాలో జరుగుతున్న ఇండ్ల గణన సర్వేను పరిశీలించి ఎన్యూమరేటర్లకు పలుసూచనలు సలహాలు చేశారు. ఈగణన పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు సూపర్‌వైజర్ శశివ్య శ్రీనివాసులు, ఎన్యూమరేటర్లు శ్రీలత, వెంకటేష్, కార్యాలయ సిబ్బంది జుబేర్ పాల్గొన్నారు.

## మల్దకల్‌లో మెడికల్ షాపులు బంద్




నిరసన తెలుపుతున్న మెడికల్ షాప్‌ల యజమానులు

**మల్దకల్ మే 20, ప్రభాతవార్త:** మెడికల్ షాపుల బంద్‌లో భాగంగా మల్దకల్ మండల కేంద్రంలోని మెడికల్ షాపులు బుధవారం బంద్ పాటించారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా కెమిస్టులు దుకాణాలు మూసివేసి నిరసన తెలుపుతున్నారు. మండల కేంద్రాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మెడికల్ షాపులు స్వచ్ఛందంగా మూసివేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆన్‌లైన్ ఫార్మసీలపై చర్యలు తీసుకోవాలని కెమిస్ట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

## బ్యాంకుల వద్ద భద్రతపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసులు

**మద్దూరు, మే 20 ప్రభాతవార్త :** మద్దూరు మండల కేంద్రంలోని బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా ఏర్పాట్లను బుధవారం మద్దూరు ఎస్సై బి. శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులకు పలు భద్రతా సూచనలు చేశారు. అధిక మొత్తంలో నగదు లావాదేవీలు నిర్వహించే వారు అప్రమత్తంగా ఉండాలని, నగదు తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏటీఎంలలో నగదు డ్రా చేసే సమయంలో అపరిచితుల సహాయం తీసుకోవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

## రైతుల సమస్యపై వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ



**మద్దూరు, మే 20 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా. వినీత్ కోస్గి పోలీస్ స్టేషన్ తనిఖీ నిర్వహించారు. అనంతరం నారాయణపేటకు వెళ్తుండగా, మద్దూరు మండలం దొరేపల్లి గ్రామ సమీపంలో రైతులు తమ వరి ధాన్యాన్ని తరలించేందుకు లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. రైతుల సమస్యను తెలుసుకున్న వెంటనే ఎస్పీ డా. వినీత్ జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంకకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

## సీఎం సహాయం నిధి ప్రజలకు గొప్ప వరం


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

**కెటిదొడ్డి మే 20, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కెటిదొడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధికి నమోదు చేసుకున్న వారికి సీఎం సహాయం నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కెటిదొడ్డి మండలం 8 మంది లబ్ధిదారులకు రెండు లక్షల 54 వేల రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అందజేశారు. లోకనాథ్ తండ్రి మునెమ్మ (చికిత్స) నిమిత్తం 60000 రూపాయలు, కురువ దూల ప్పతండ్రి కురువ బుచ్చయ్య (చికిత్స) నిమిత్తం 50000 రూపాయలు,చాకలి గోవిందమ్మ భర్త పెద్ద రంగప్ప (చికిత్స) నిమిత్తం 35000 రూపాయలు, తిరుమలేష్ తండ్రి తిరుమలేష్ (చికిత్స) నిమిత్తం 26000 రూపాయలు ,బోయ నాగరాజు తండ్రి గజన్న (చికిత్స) నిమిత్తం 24000 రూపాయలు,శిరమ్మ భర్త ఎల్లప్ప (చికిత్స) నిమిత్తం 22000 రూపాయలు, హరిజన్ బసవరాజు తండ్రి సాబయ్య (చికిత్స) నిమిత్తం 20500 రూపాయలు,లక్ష్మీభర్త నరసింహులు (చికిత్స) నిమిత్తం 16500 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో దొంగల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వెల్టూరు సర్పంచ్ చింతోజు వెంకటేష్


వెల్టూర్ గ్రామంలో దొంగతనాలకు తావివ్వకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న సర్పంచ్

**ఉప్పునుంతల, మే 20 ప్రభాతవార్త :** వెల్టూరు గ్రామంలో తరచుగా దొంగతనాల సంఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం రాత్రి వేళల్లో ఇంటి తలుపులు, సురక్షితంగా ఉండేందుకు ఏర్పాటు చేసుకున్న గేట్లకు తాళాలు వేసుకొని ఉండాలని, గ్రామంలో అనుమాన వ్యక్తులు సంచరిస్తే వెంటనే గ్రామస్తులకు గాని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సర్పంచ్ సూచించారు. గ్రామంలో యువత రాత్రివేళల్లో పహారా నిర్వహించేందుకు ముందుకు రావాలని, గ్రామ ప్రజలే భద్రతని , గ్రామంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటేనే దొంగతనాలను నివారించగలమన్నారు. గ్రామంలో సిసి కెమెరా ఏర్పాటు, వీధి దీపాలను సక్రమంగా వెలగించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచు పేర్కొన్నారు. మన గ్రామాన్ని మనమే భద్రపరుచు కోవాలని, గ్రామ ప్రజలు రాత్రి వేళలో తమ ఇళ్లకు తాళాలు వేసుకొని, గేట్లు మూసుకొని నిలవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఇడమెని దేవేందర్, వార్డు సభ్యులు సుంకరి మౌనిక నాగరాజు,అభితేజ్ రెడ్డి, సాయి బాబు, మాజీ వార్డు సభ్యులు జానయ్య, గ్రామస్తులు ఉప్పరి బాలరాజు, శ్రీను, సైదులు, సమద్ పాల్గొన్నారు.

## ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థల పరిశీలన

### కౌన్సిలర్ బోరెల్లి మహేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిజ్జ రమేష్


ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసిన కౌన్సిలర్ బోరెల్లి మహేష్

**కొల్లాపూర్,మే20,ప్రభాతవార్త :** కొల్లాపూర్ మున్సిపల్‌పరిధిలోని 10వ.వార్డులో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌నిర్మాణం కోసం కౌన్సిలర్ బోరెల్లి మహేష్ ఆధ్వర్యంలో అధికారులు స్థల పరిశీలన చేశారు.మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కౌన్సిలర్ బోరెల్లి మహేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిజ్జ రమేష్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని ఇటీవలే రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లిన విషయం విదితమే. సానుకూలంగా స్పందించిన రాష్ట్ర మంత్రి వర్యులు 10వార్డులో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ" 10,00,000 (పది లక్షల రూపాయలతో) వ్యయంతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆర్డర్ కాపీని విడుదల చేశారు.అందులో భాగంగానే బుధవారం 10వ వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్ ఆధ్వర్యంలో చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అధికారులు స్థల పరిశీలన చేశారు.త్వరలోనే భూమి పూజ నిర్వహించి నిర్మాణం చేపడుతామని కౌన్సిలర్ బోరెల్లిమహేష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బిజ్జ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు రాష్ట్ర మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు కి,కౌన్సిలర్ బొరెల్లి మహేష్‌కి, బిజ్జ రమేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయ లచ్చి నాయుడు, రమేష్ నాయుడు, శబద్దీన్, షాహీద్,ఖాదర్, మున్సిపల్ వర్క్ ఇన్స్‌పెక్టర్ మన్యం,కురుమయ్య , తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 24న జయరాములు 41 వర్ధంతి వేడుకలు

### అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

**వనపర్తిరూరల్,మే20, ప్రభాతవార్త:** ఈనెల24 అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గుమ్మడం జయరాములు 41వర్ధంతిలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఐక్యవేదిక జిల్లాఅధ్యక్షులు సతీష్‌యాదవ్ కోరారు.బుధవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని జంగిడిపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వనపర్తికి సేవ చేసిన బడుగు బలహీనవర్గాల ఎమ్మెల్యేలను ప్రతినిధులు మర్చిపోయారన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా ఐక్యవేదిక ముందుకు వచ్చి మాజీ ఎమ్మెల్యేల జయంతులు, వర్ధంతులు చేసి ప్రజలకు కూడా క్యాలెండర్ ద్వారా తెలిపిందని గుర్తుచేశారు.అందుకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే కీ॥శే॥ గుమ్మడం జయరాములు 41 వర్ధంతి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మర్రికుంట పాలకేంద్రం దగ్గర 24వ తారీఖు ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు జరుగుతుందని ఈ కార్యక్రమానికి అన్ని ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి ఎన్నికల అధికార ప్రతినిధి కొత్త గొల్ల శంకర్, బిఎస్పి నాయకులు మైబూస్, లోక్‌సత్తా నాయకులు రాజ్ కుమార్, టిఆర్ఎస్ నాయకులు శివకుమార్, రాములు, రాజనగరం రామస్వామి, చందు, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా మిషన్ భగీరథ తాగునీటి తరలింపు

### మున్సిపల్ అధికారుల తీరుపై మక్తల్ బీజేపీ నేత బ్యాటరీ రాజు ధ్వజం


మిషన్ భగీరథ నీటిని తరలిస్తున్న కాంట్రాక్టర్లు

**మక్తల్,మే 20 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతుంటే, మరోవైపు మిషన్ భగీరథ ద్వారా వచ్చే స్వచ్ఛమైన మంచినీటిని సీసీ రోడ్ల క్యూరింగ్‌కు యథేచ్ఛగా వాడేస్తుండటం తీవ్ర కలకలం రేపుతోంది. దీనిపై మక్తల్‌టౌన్ బీజేపీకార్యదర్శి బ్యాటరీ రాజు తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల గొంతు ఎండగడుతూ,వారికి అందాల్సిన నీటిని ప్రైవేటు కాంట్రాక్టర్ల నిర్మాణ పనులకు మళ్లించడం అత్యంత బాధాకరమని ఆయన మండిపడ్డారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ ఎవరైనా సరే.. రోడ్డు నిర్మాణ క్యూరింగ్‌కు, మెటీరియల్ మిక్సింగ్‌కు అవసరమైన నీటిని సొంత ఖర్చులతో బయటి నుండి తెచ్చుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ దానికి భిన్నంగా, ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పబ్లిక్ వాటర్ ట్యాంక్ మంచినీటిని కాంట్రాక్టర్లు తమ స్వార్థానికి వినియోగిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇంతటి దారుణం పట్టణంలో బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.అధికారుల కళ్ల ముందే ప్రజాధనం, తాగునీరు దుర్వినియోగం అవుతున్నా స్పందించకపోవడంపై పట్టణ ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని బ్యాటరీ రాజు హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే ఈ వ్యవహారంపై స్పందించి విచారణ చేపట్టాలని, తాగునీటిని మళ్లించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

- దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి
- నూతన కోఆప్షన్ సభ్యుల్ని సన్మానించిన ఎమ్మెల్యే జీఎంఆర్,చైర్మన్ బాలకోటి


భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,నూతన కోఆప్షన్ సభ్యులతో ఎమ్మెల్యే జీఎంఆర్


కౌన్సిల్ సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్


నూతన కోఆప్షన్ సభ్యుడు కోరె పవన్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

**భూత్పూర్,మే 20,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీకి కొత్తగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు కౌన్సిలర్లు,చైర్మన్,వైస్ చైర్మన్‌లతో కలిసి సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)అన్నారు. బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీలో చైర్మన్ ముడావత్ బాలకోటి అధ్యక్షతన జరిగిన నలుగురు నూతన కోఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ మున్సిపాలిటీకి ఇప్పుడున్న చైర్మన్ ముడావత్ బాలకోటి,వైస్ చైర్మన్ లిక్కి సూర్యకళలతో పాటు కౌన్సిలర్లు ముడావత్ మాధురి(ఒకటోవార్డు),నిమ్మల అన్నపూర్ణ(రెండోవార్డు),పాల్త్యావత్ లాల్య(మూడోవార్డు),గడ్డం ప్రేమ్‌కుమార్(నాల్గోవార్డు),కెంద్యాల పద్మ(ఐదోవార్డు), కెంద్యాల శ్రీనివాసులు(ఆరోవార్డు),లత సూరన్నగారి(ఏడోవార్డు), చంద్రకళ(తొమ్మిదోవార్డు)లతో పాటు బుధవారం ఎంపికైన నూతన కోఆప్షన్ సభ్యులు కోరె పవన్‌కుమార్(అమిస్తాపూర్),తన్వీర్ సుల్తానా(భూత్పూర్),ఆగిరి లావణ్య(అమిస్తాపూర్),ఎండి అఫ్రోజ్ పాష(అమిస్తాపూర్)లు చైర్మన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లతో కలిసి సమిష్టిగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు,మేనేజర్ రమేష్‌నాయక్‌లతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు మొహ్మద్ జమీల్(జమ్ము)తో పాటు గ్రామాల సర్పంచులు మాసగౌడ్(కప్పెట), ఆనంద రెడ్డి(పోతులమడుగు),మలిశెట్టి వెంకటేష్(కొత్తమొల్గర) నాయకులు బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప,గడ్డం యాదయ్య,బజార్ పరుశురాం,కెంద్యాల నరేందర్,కెంద్యాల రాజేష్‌కుమార్,కెంద్యాల మశ్చందర్,మట్టి ఆనంద్,పవన్,కోరె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కౌన్సిల్‌లో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే**

నూతనంగా ఎంపికైన కోఆప్షన్ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ కౌన్సిల్‌లో చైర్మన్ ముడావత్ బాలకోటి, వైస్ చైర్మన్ లిక్కి సూర్యకళ ఇతర కౌన్సిల్ సభ్యులతో కలిసి మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ రాష్ట్ర ప్రభుత్వం భూత్పూర్ మున్సిపాలిటీకి కేటాయించిన రు.20కోట్ల నిధులపై సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది.మున్సిపాలిటీలోని పదివార్డులలో తాగునీటి సరఫరా,డ్రైనేజీల పరిశుభ్రత,సీసీరోడ్ల పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

# పకడ్బందీగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

**మండల స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశానికి హాజరైన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు**


బూత్ లెవెల్ ఏజెంట్ల దిశ నిర్దేశం చేస్తున్న బాసు హనుమంతు నాయుడు

**ధరూర్ మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశానికి బాసు హనుమంతు నాయుడు హాజరై, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టిందని దీనికి ప్రతి కార్యకర్త సహకరించాలని కోరారు.గద్వాల నియోజకవర్గం సభ్యత్వ నమోదులో ముందుండే విధంగా చర్యలు తీసుకుందామని అందుకు నాయకులు,కార్యకర్తల సహకారం ఎంతో అవసరమన్నారు.రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే కార్యకర్తలు సన్నద్ధం కావాలని,ఉద్యమనేత కేసీఆర్ స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేసి, మళ్లీ బీఆర్ఎస్ పాలనను తెచ్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు.కేసీఆర్ నాయకత్వంలో బూత్ లెవల్ నాయకత్వం,పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయన సొంతమని పేర్కొన్నారు. ఎస్ఐర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.బీజేపీకి అనుకూలంగా లేనిచోట ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నదని, ఇప్పటివరకు ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లు గల్లంతైన విషయాన్ని ప్రస్తావించారు. వచ్చే నెలలో ప్రారంభమయ్యే ఎస్ఐర్ ప్రక్రియలో ప్రతి బూత్ లెవెల్ కార్యకర్త బూత్ లెవల్ ఏజెంట్గా ప్రతి బూత్ పరిధిలో ఓటర్లను కాపాడుకోవాలని కోరారు. కాంగ్రెస్ సర్కార్ దొంగ ఓట్లను వేయించే పరిస్థితి ఉన్నదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబుల్ ఓట్లను ఏరివేయడంతో పాటు ఏదో ఒక చోట ఓటు హక్కు ఉండేలా చూడాలని తెలిపారు. ఈ నెల 23వ తేదీన అనగా శనివారం రోజు జిల్లా కేంద్రం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే పార్టీ కార్యకర్తల బూత్ లెవెల్ సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి, జి.రాఘవేంద్ర రెడ్డి,చక్రధర్ రావు, సి.కె.రంగన్న,అల్లపాడు ప్రతాప్, రాజారెడ్డి, మోనేష్,వెంకటేష్ నాయుడు, చిన్నపాడు ఆంజనేయులు, సోమశేఖర్ రెడ్డి,రాజశేఖర్,బీచుపల్లి,జాంపల్లి భరత్ సింహారెడ్డి, కావాలి గోపి,గాజుల కృష్ణారెడ్డి, గోవిందు,లక్ష్మారెడ్డి, గోనెల స్వామి, డ్యామ్ శ్రీను,ముని,నరసింహులు,మాలిక్, అంజి, వెంకటేష్, రాము,అబ్రహం,రంగారెడ్డి,ఆంజనేయులు,నాగరాజు,జమన్న,రమేష్, సిద్దు, తిమ్మప్ప, రఘు,శేఖర్,రవి, వీరేష్, రాజు,మహేష్, కృష్ణ, మహేందర్, నరేష్,హరికృష్ణ, జయన్న, వెంకటప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

# డ్రగ్స్ రహిత సమాజానికై ప్రతి ఒక్కరూ సహకరించాలి

**డ్రగ్స్ నిర్మూలన, నిషేధిత పదార్థాల నియంత్రణ చర్యలు**
**లింగాలలో డాగ్ స్క్వాడ్ ప్రత్యేక తనిఖీలు**



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

**లింగాల,మే 20, ప్రభాతవార్త :** ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలన మరియు నిషేధిత పదార్థాల నియంత్రణలో భాగంగా డాగ్ స్క్వాడ్ బృందం లింగాల గ్రామంలో విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలను బుధవారం నిర్వహించింది. గ్రామంలోని గవర్న మెంట్ స్కూల్ పరిసర ప్రాంతం, పాన్ షాపులు, అనుమానాస్పద కిరాణా దుకాణాలు, రామాలయం పక్కన గల చెరువు కట్ట ప్రాం తంలో డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు చేపట్టారు.ప్రత్యేకంగా యువత ఎక్కువగా గుమికూడే ప్రదేశాలు, విద్యాసంస్థల పరిసరా లు, గ్రామ శివారు ప్రాంతాలలో నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి, గుట్కా మరియు టొబాకో సంబంధిత ఉత్పత్తుల విక్రయాలు జరు గుతున్నాయా అనే కోణంలో తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పాన్ షాపులు, అనుమానాస్పద ప్రాంతాలలో నిషేధిత పదార్థాల నిల్వ, విక్రయం మరియు వినియోగంపై నిఘా ఉంచి పరిశీలనలు చేపట్టారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, సమాజంలో నేరాల పెరుగుదలకు కారణమవుతుం దని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల గ్రామస్థులు, యువత, వ్యాపారులు డ్రగ్స్, టొబాకో ఉత్పత్తుల విక్రయాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాలలో గంజాయి సేవించే వ్యక్తులు తరచుగా గుమికూడే ప్రదేశాలను గుర్తించి, అటువంటి ప్రాంతాలలో నిరంతర తనిఖీలు కొనసాగించనున్నట్లు తెలిపారు.ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ఎవరైనా అనుమానాస్పదంగా డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. నిరంతర తనిఖీలు, కట్టుదిట్టమైన చర్యల ద్వారా డ్రగ్స్ నియంత్రణ మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని తెలిపారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

# మాజీ ఎస్ఐపై కేసు నమోదు.. బీఆర్ఎస్ నాయకుల సంబరాలు


బిఆర్ఎస్ నాయకుల సంబరాలు

**మద్దూరు, మే 20 ప్రభాతవార్త :** మద్దూరు మండలంలో గతంలో విధులు నిర్వహించిన మాజీ ఎస్ఐ విజయ్ కుమార్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడంతో కొత్తపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కొత్తపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎస్ఐ విజయ్ కుమార్ విధులు నిర్వహించిన కాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒకే రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అనేక అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. చట్టాన్ని అడ్డుపెట్టుకుని అమాయక ప్రజలను వేధించిన వారికి ఇప్పుడు అదే చట్టం సమాధానం చెప్పే పరిస్థితి వచ్చింది" అని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ కక్షసాధింపుతో గతంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై నమోదు చేసిన కేసులను తిరిగి సమీక్షించి, నిరాధా ర కేసులను వెంటనే కొట్టివేయాలని ప్రభుత్వాన్ని ఉన్నతాధి కారులను డిమాండ్ చేశారు.పోలీసు వ్యవస్థ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా నిస్పక్షపాతంగా పనిచేయాలని, అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, రాజు రెడ్డి, నరసింహ, సుల్తాన్, శివారెడ్డి, భగవంతు, రామ్ రెడ్డి, రాజు ,పెద్దపూరు రవి, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సంబరాలు చేసుకుంటున్న బిఆర్ఎస్ నాయకులు

## కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి




**మాగనూర్, మే 20 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. యజమాని నడిగేరి కిష్టప్ప వివరాల ప్రకారం తన పొలం దగ్గర మంగళవారం రాత్రి వీచిన గాలి దుమారానికి చెట్లు విరిగి కరెంటు వైరు కింద పడిందని తెలిపారు. ప్రమాదవశాత్తు కరెంటు వైర్ ఎద్దుకు తగిలి అక్కడికక్కడే ఎద్దు మృతి చెందినట్లు తెలిపారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న సమయంలో ఎద్దు చనిపోవడం తనకు తీరని నష్టమని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

**ఉప్పునుంతల, మే 20 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కట్ల బండ సమీపంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు తూర్పాల ( మరక) లో గ్రామానికి చెందిన ఉప్పునుంతల హారిక(16) తల వెంట్రుకలు పడడంతో వెంటనే యంత్రాన్ని నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన తూర్పు పట్టే మరక వద్ద వడ్లు తూర్పార పట్టడానికి తల్లి ఉప్పునుంతల లావణ్యకు తోడ్పాటు అందించేందుకు కూతురు హారిక వెళ్ళింది. తూర్పు పట్టే యంత్రం వద్ద తల వెంట్రుకలు యంత్రంలో పడ్డాయి. వెంటనే యంత్రాన్ని నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది. మహిళలు తలలకు పాగా కట్టుకొని పనులు నిర్వహించాల్సి ఉండగా నిర్లక్ష్యంతో ఉండడం తోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికి ఇటువంటి పనులు చేపడుతున్నప్పుడు మహిళలు చాలా జాగ్రత్తగా ఉండాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## మెడికల్ షాపుల బంద్ విజయవంతం

### స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన మెడికల్ షాపుల యజమానులు



మెడికల్ షాపులు బంద్ చేసిన దృశ్యం

**పెబ్బేరు, మే 20 ప్రభాతవార్త :** అఖిల భారత కెమిస్టులు, డ్రగిస్టుల సంఘం(ఏఐఒసీడీ) ఇచ్చిన పిలుపు మేరకు వనపర్తి జిల్లా కెమిస్టులు, డ్రగిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ఒక్క రోజు మెడికల్ షాపుల బంద్ కార్యక్రమం విజయవంతమైంది. పెబ్బేరు మెడికల్ షాపుల యజమానులు స్వచ్ఛందంగా పాల్గొని షాపులను మూసివేసి బందును విజయవంతం చేశారు. ఆన్ లైన్ ద్వారా మందుల విక్రయాలను నిలిపివేయాలని, కార్పొరేట్ కంపెనీల భారీ డిస్కౌంట్లను ఆపాలని, కల్తీ ఔషధాలను నియంత్రించాలని మెడికల్ షాపుల యజమానులు డిమాండ్ చేశారు.

# బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**వనపర్తి, మే 20 ప్రభాతవార్త:** ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి రాజకీయ పార్టీ బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించి బూత్‌లెవల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్ ఎన్ఐసి హాల్‌లో జిల్లా కలెక్టర్ త్వరలో చేపట్టానున్న ప్రత్యేక సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్షవ్ రెవిషన్ సార్ ) నిర్వహణపై గుర్తింపు పొందినరాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్)షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివ రంగా తెలియజేశారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుండి 24 వరకు సన్నా హక కార్యక్రమాలు,బూత్‌ల మ్యాపింగ్, బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించ



వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అధికారులు

నున్నట్లు తెలిపారు. జూన్25 నుండి జులై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు)ఇంటింటి సర్వేనిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరించనున్నట్లు చెప్పారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా (డ్రాఫ్ట్ ఎలక్టరల్ రోల్) ప్రచురించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు, అనంతరం సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కారం చేపట్టి అక్టోబర్ 1నతుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు.ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి రాజకీయ పార్టీబూత్ లెవల్ ఏజెంట్లను నియమించి బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు,మరణించిన డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను శాలువాతో సన్మానించిన కమిటీ సభ్యులు

## జిల్లాలో నూతన అక్రిడేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

**నారాయణపేట, మే20 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అక్రిడేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించారు. డీపీఆర్ఓ రషీద్ సమన్వయంతో మొదటి విడతలో భాగంగా జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడేషన్ కార్డులపంపిణీ ప్రక్రియ పూర్తయిన అనంతరం జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం కోసం తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొంటూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, భీమ్సన్ రావు, సంజు ప్రకాష్, శ్రీధర్ రావు, రఘు, గణప నారాయణ, ఆనంద్‌గౌడ్, రాజు, కోరం శంకర్ రెడ్డి, నక్క శ్రీనివాస్, అంబదాస్, తకిచంద్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి రూ.1లక్ష విరాళం

**వెల్దండ, మే 20 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో పునర్ నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కానుగుల కన్యాకుమారి జోగయ్య తన సొంతంగా రూ.1 లక్ష విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా జోగయ్య మాట్లాడుతూ దేవాలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులుచంద్రమోహన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీదేవి, సింహారెడ్డి, నిరంజన్, ఆనంద్, దేవేందర్, ప్రవీణ్, సైదులు, వెంకటయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## తప్పిన పెను ప్రమాదం..

### -సిగ్నల్ వద్ద ఆగిన వాహనాలపైకి దూసుకెళ్లిన లారీ...

**కల్వకుర్తి, మే20 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో రద్దీగా ఉండే హైదరాబాద్ చౌరస్తా వద్ద బుధవారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్రాఫిక్ సిగ్నల్ పడటంతో వాహనాలు నిలిచి ఉండటంతో దేవరకొండ వైపు నుంచి అతి వేగంగా వచ్చిన లారీ వాటిని బలంగా ఢీకొట్టింది. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌సిగ్నల్ పడటంతో పలు వాహనాలు నిలిచి ఉన్నాయి.ఇదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి,ముందున్నవాహనాలను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతను గమనించిన ఓ బైకర్, క్షణాల్లో అప్రమత్తమై పక్కకు దూకడంతో పెను ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో పలు వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరిగిన తీరు చూసి అక్కడున్న వారంతా ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొనిని పరిస్థితిని సమీక్షించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక ట్రాఫిక్ నిబంధనల అమలుపై మరింత నిఘా అవసరమని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదానికి గురైన లారీ

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



**అచ్చంపేట, మే,20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని సర్పంచి సంతోష్ రెడ్డి అన్నారు.అచ్చంపేట మండలం పల్కపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను సర్పంచి సంతోష్‌రెడ్డి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదలకు ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు నిర్మించుకోవాలని ఉద్దేశంతో రూ. 5 లక్షలు ప్రతి ఇంటికి మంజూరు చేయడం జరుగుతుందని దాంతో నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనం ఆలస్యంగా తెరుచుకోవడంతో ప్రజల ఆవేదన

**నారాయణపేట, మే 20 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలోని మహిళా సమైక్య భవనం ఉదయం 10:30 గంటలు దాటినా తెరవకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు భవనం బయటే నిరీక్షించాల్సి వచ్చింది. సమయానికి కార్యాలయం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది ఆలస్యంగా రావడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సేవలందించే కార్యాలయాల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయాల నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను ఉప్పరి రవి తండ్రి ఉప్పరి పుల్లన్న ఇంటి నెం. 196, గ్రామం ఎర్రవల్లి, మండలం ఎర్రవల్లి, జోగులాంబ గద్వాల జిల్లా. లింక్ డాక్యుమెంట్స్ నెంబర్లు 1385/2017, 14694/2017, 20739/2019 ఉన్న ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ బైకుపై ఎర్రవల్లి నుండి గద్వాలకి పోతున్నప్పుడు పోగొట్టుకు పోయినవి ఎవరికైనా దొరికితే పై చిరునామాకు తెలియజేయగలరు.

సెల్ నం : 9885158554

## ఒండ్రు మట్టి తవ్వడానికి

# ఎవ్వరికి అనుమతులు ఇవ్వం

- ఇచ్చిన వాటికి అనుమతులు రద్దు చేసి కలెక్టర్‌కు నివేదిక పంపుతాం
- ఇటుక బట్టీలపై, నల్ల మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదిక పంపుతా : తహసిల్దార్
- ఈఈ హామీతో నిరసన కార్యక్రమాన్ని ఆపిన ప్రజా సంఘాలు



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

**మక్తల్ టౌన్, మే 20 ప్రభాతవార్త:** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మక్తల్ లోని తహసిల్దార్, నీటిపారుదల శాఖ కార్యాలయాల ముందు నిరసన చేపట్టి అనంతరం ఆయా అధికారులకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ వినతి పత్రంలో చెరువులలోని ఒండ్రు మట్టిని ఎందుకు ఇటుక బట్టీలకు తరలించ కూడదో ప్రజా సంఘాల నాయకులు వివరించారు. అంతేకాక చెరువులోని వండు మట్టిని ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ పొలాలకు ప్రభుత్వమే ఎందుకు అందించాలో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మక్తల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల చెరువుల నుండి ఒండ్రు మట్టిని ఇటుక బట్టీలకు తరలించడం జరుగుతున్నది. మక్తల్ తాలూకా లోని వివిధ గ్రామాల పరిధిలో జరుగుతున్న నల్ల మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేసి, ఈ మట్టిని ఇటుక బట్టీలకు తరలించే విధానాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.చంద్రశేఖర్, కెఎన్‌పిఎస్ కిరణ్ కుమార్, భుట్టో భగవంతు, పృథ్వీరాజ్, అక్షయ్ కుమార్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం


- సకాలంలో లారీలు పంపడం లేదు
- రైతులకు అందుబాటులో లేని బుక్ కీపర్స్
- ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు, బీసీ పొలిటికల్ అధ్యక్షుడు మహేందర్ నాయకుడు



బీసీ పొలిటికల్ అధ్యక్షుడు మహేందర్ నాయకుడు

**మదనాపురం, మే 20 ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిరక్ష్యం చేస్తున్నారని బీసీ పొలిటికల్ మండల అధ్యక్షుడు మహేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 నెలలు కావస్తున్నా వడ్లు కొనుగోలు కేంద్రంలో అధికారులు సకాలంలో లారీలు పంపడం లేదని, పంపినా రైస్‌మిల్లుల వద్ద లారీల్లో ఉన్న ధాన్యం ఖాళీ చేయడం లేదన్నారు.అధికారులు నిరక్ష్యం చేస్తున్నారని, నిబంధనల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్లు బుక్ కీపర్ లో వాటా ఎంత ముడుతుందని అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొనుగోలు సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షంతో పంట నష్టం జరిగే ప్రమాదం ఉందని, రైతులు పండించిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## కారు, బస్సు ఢీకొని ఒకరి మృతి



కారు, బస్సు ఢీకొన్న దృశ్యం



మృతి చెందిన వ్యక్తి

**పెబ్బేరు, మే20 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు 44వ జాతీయ రహదారిపై కారు, బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ వివరాల ప్రకారం హైదరాబాదు నుండి బెంగళూరు వెళుతున్న కర్ణాటక ఆర్టీసీ బస్సును కర్నూలు జిల్లాకు చెందిన తోట నారాయణ కారులో కర్నూల్ నుండి హైదరాబాద్ కి వెళ్తుండగా రంగాపురం బైపాస్ దగ్గర కర్ణాటక ఆర్టీసీ బస్సును వెనుక నుండి ఢీకొనడంతోతోటనారాయణ(67)అను వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు .మృతుని కుమారుడు, అల్లుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## ధన్వాడలో విషాదం

### - కోనేరులో పడి యువకుడు మృతి

**ధన్వాడ, మే 20 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడ లో విషా దకర ఘటన చోటుచేసుకుంది. బుధవారం మధ్యాహ్నం సుమారు 1 గంటల సమయంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని బావిలో ఒక వ్యక్తి ఈత కోసం వెళ్లి మునిగిపోయినట్టు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే ధన్వాడ ఎస్సై ఘటన స్థలానికి చేరుకునిఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి శోధన చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయట కు తీశారు.మృతుడిని ధన్వాడకు చెందిన మున్నా (27)గా గుర్తించారు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నారాయణపేట ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనతో ధన్వాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మున్నా మృతిపై తీవ్ర దుఃఖం వ్యక్తం చేస్తున్నారు.



కోనేటిలో పడి మృతి చెందిన యువకుడు

## యువకుడు మృతి

**మద్దూరు, మే 20 ప్రభాతవార్త:** కొత్తపల్లి మండలంలోని మన్నాపూర్ గ్రామానికి చెందిన జిన్నారం శివకుమార్ (19) అనే యువకుడు బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని వాగుకు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లు సమాచారం. మృతుడి తల్లి ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మద్దూరు ఎస్సై బి. శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



మృతి చెందిన శివకుమార్

## పురుగుల మందు తాగిన యువకుడు

**చిన్న చింతకుంట, మే 20 ప్రభాతవార్త:** తమ ఇంటిపై దాడి చేసి ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యను తీసుకెళ్లడంతో మనస్థాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగిన ఘటన కౌకుంట్ల మండలం తిరుమలపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కౌకుంట్లమండలం తిరుమలాపూర్ గ్రామా నికి చెందిన కురువ నవీన్ కుమార్ దాసర్ పల్లి గ్రామానికి చెందిన పల్లవిని ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో అమ్మాయి బంధువులైన మధుసూదన్, శ్రీహర్ష తమ ఇంటిపై దాడి చేసి నవీన్ భార్యను తీసుకెళ్లిన అత్తపై కూడా కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై తెలిపారు .తనభార్యను తీసుకెళ్లడంతో నవీన్‌కుమార్ మనస్థాపంతో బుధ వారం పురుగుల మందు త్రాగి అపస్మారస్థితికి చేరుకోవడంతో వెంటనే 108 అంబులెన్సులో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యానికి వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన తెలిపారు.

## రామన్ పాడ్ గ్రామంలో జోరందుకున్న సర్వే



సర్వేలో పాల్గొన్న అధికారులు

**మదనాపురం, మే 20 ప్రభాతవార్త:** జనగణన ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటికీ వెళ్లి వేగవంతంపై రామన్ పాడ్ గ్రామంలో జరిగింది అనిస్కూల్ హెచ్ఎం జలంధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లి ఇల్లు మ్యాపింగ్ చేస్తూ ఇంట్లో ఉన్న సభ్యులను గుర్తిస్తూ జనగణనలో పొందిపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆఫ్రిన్ బేగం అంజద్ అలీ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 16వ వార్డులో డ్రైనేజీ పనులు ప్రారంభం

**మక్తల్ టౌన్, మే 20 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ 16 వ వార్డులో మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు డ్రైనేజీ పనులను స్థానిక వార్డుకౌన్సిలర్ అల్కూరి పావని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని, తాజాగా డ్రైనేజీ పనులను సైతం ప్రారంభించామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శాలం, నాయకులు అల్కూరి రవికుమార్, వల్లంపల్లి మధు, శ్రీనివాస్, ప్రణయ్, దామరగిద్ద రాము, దీపక్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న వార్డు కౌన్సిలర్

## ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో ప్రజల గడప వద్దకే పోలీసు సేవలు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భాల్లో ప్రజలు అత్యవసర సమయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో 100డయల్‌కు గాని లేదా సంబంధిత పోలీస్ అధికారికి నేరుగా ఫోన్ చేసి సమాచారం అందజేస్తే పోలీసు అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి తక్షణ చర్యలు ప్రారంభిస్తారు. సమస్య ఎక్కడ జరిగినా ప్రజలకు పోలీసు సహాయం త్వరగా అందాలన్నదే మా లక్ష్యం. ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు కేసుల దర్యాప్తు మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుందని,వనపర్తి జిల్లా పోలీసులు ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించే దిశగా కృషి చేస్తున్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి. ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి బాధితులకు న్యాయం అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో మైనర్ బాలికకు తక్షణ న్యాయంఈ విధానం ద్వారా ఇప్పటికేపలు కేసుల్లో బాధితులకు వేగవంతమైన న్యాయం అందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒకహాస్టల్‌లో చదువుకుంటున్నమైనర్ బాలికకు హైదరాబాద్‌కు చెందిన ఓవ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచ యమై వేధింపులకు గురిచేస్తున్నాడు.తన బాధనుఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్న ఆబాలిక ధైర్యం చేసి డయల్100 కు ఫోన్ చేసి సమా చారం అందించింది.ఫిర్యాదు అందుకున్న వెంటనేవనపర్తి పోలీసులు స్పందించి నేరుగాహాస్టల్ వద్దకు చేరుకుని బాలిక నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం వెంటనే కేసునమోదు చేసి, సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్‌చేసి జైలుకు తరలించారు. ఈ ఘటన ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్" విధానం ఎంత వేగంగా, బాధితులకు ఎంత భరోసానిచ్చే విధంగాపనిచేస్తుందోచూపించే ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని పోలీసులు తెలిపారు.భయపడకుండా ముందుకు వచ్చిసమాచారం అందిస్తే పోలీసుశాఖ ప్రతిబాధితుడికి అండగాఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

## రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎక్కడుంది..?

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట మహబూబ్‌నగర్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కొడగల్ యాదయ్య, బిఆర్ఎస్ నాయకులు పాలాది రామ్మోహన్, నాగిరెడ్డి, ఇంతియాజ్ ఖాన్, టైగర్ నరసింహ, కరాటే శ్రీను, ఆలూరి శశికిరణ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## ప్రజా క్షేమమే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు కోసం ఎస్పి డాక్యుమెంట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న వారు రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌కుఅంతరాయం కలిగించకుండా అవగాహన కల్పిస్తూ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో, బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు సేవలందించడం తమ ప్రాధాన్యతగా తీసుకోవాలని తెలిపారు. మహబూబ్‌నగరాన్ని భద్రమైన, సురక్షితమైన పట్టణంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత. రోడ్డు ప్రమాదాలు తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రజలు, అధికారులు కలిసి పని చేస్తే మంచి ఫలితాలు సాధించగలం" అనిఎమ్మెల్యే పేర్కొన్నారు.మహబూబ్‌నగర్‌ను ఆక్సిడెంట్ ఫ్రీజోన్‌గా అభివృద్ధి చేయాలని సంకల్పించుకున్నట్లు తెలిపారు.ఈ చర్యల ద్వారా నగరంలో ట్రాఫిక్ నియంత్రణ మెరుగుపడి, రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గిప్రజలకు మరింత భద్రత కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, పోలీస్, మున్సిపల్, ట్రాఫిక్, రోడ్ రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు

## క్రీడలు ఎంతో దోహదపడతాయి

(మొదటి పేజీ తరువాయి)

సమ్మర్ క్యాంపులో పాల్గొని క్రీడల్లోరాణించడం అభినందనీయమని, విద్యార్థుల్లో ప్రోత్సహిస్తూ పాఠశాలలో సమగ్రభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వేసవి కబడ్డీ శిక్షణశిబిరం విజయవంతం నిర్వహించడానికి వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. సమ్మర్ క్యాంపుకు సహకరిస్తున్న గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్‌కు గ్రామ యువతకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్,వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్,వెంకటేష్, నాగేష్, బూషి రాజ్ మల్లయ్య, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాభివృద్ధికి కలెక్టర్ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టమైన కార్యాచరణతో, నిరంతర పర్యవేక్షణతో అమలు చేస్తామని తెలిపారు.ప్రతి పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఫలితాధారిత చర్యలు తీసుకుంటామని చెప్పారు.జిల్లా కలెక్టర్ అందించినప్రోత్సాహం, మార్గదర్శకత్వం విద్యా శాఖ సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, ఎస్‌వో నాగార్జున రెడ్డి, సీఎస్ఎఫ్ ప్రతినిధులు శ్యామ్ సింగ్, జై, శ్రీహర్ష, ఆలోకిత్ ప్రతినిధులు సాయి ప్రమోద్, పవన్,నగేష్,ఎంఈఓలు నిజాముద్దీన్, ఆంజనేయులు,మాధవి రాంరెడ్డి, గణేష్ సింగ్, బాలాజీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, చంద్రకళ, కిషోర్, అకాడమిక్ ప్యానెల్ సభ్యులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీలో ప్రత్యేక అడిషనల్ కలెక్టర్ ద్వారా

## పరిపాలన కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

చేశారని, కానీ ప్రస్తుత పాలనలో అభివృద్ధి మాత్రం పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. స్థానిక చెరువు కట్టపై నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలను భవిష్యత్తులో బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు. అధికార పార్టీ దౌర్జన్యాల వల్లే మున్సిపల్ కమిషనర్లు వచ్చినట్లే వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారని, కిందిస్థాయి ఉద్యోగులతో పరిపాలన సాగిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనిఆగ్రహం వ్యక్తం చేశారు. మక్తల్ మున్సిపాలిటీలో ప్రత్యేక అడిషనల్ కలెక్టర్ ద్వారా పరిపాలనా పర్యవేక్షణ జరగాలని ఈసందర్భంగా ఆయన కలెక్టర్‌నుపత్రికా ముఖంగా కోరారు. అనంతరం 12వ వార్డు మాజీ కౌన్సిలర్ అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ గతంలో జరిగిన పనులకు నకిలీ తీర్మానాలతో ప్రస్తుత అధికార పార్టీ కౌన్సిలర్ దొంగతనంగా బిల్లులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో చేసిన తీర్మానాన్ని ఇప్పుడు చేసినట్లుగా చూపించి, అప్పట్లో పనులుజరిగిన చోటనే పేర్లు మార్చి బిల్లులు కాజేయాలని చూస్తున్న సదరు వార్డు కౌన్సిలర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వన్నెకార్ రాజు, మాజీ కౌన్సిలర్ మొగులప్ప, మన్నన్, జె. సాగర్, గుంటి రఘు పాల్గొన్నారు.